





అలంకరణలో వాసవీమాత... హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

వాసవీ మాతకు నీరాజనం

పెనుగొండ, ఫిబ్రవరి 11 : పెనుగొండ వాసవీమాత ఆలయంలో ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆత్మార్పణ, పంచమ వార్షికోత్సవాలను ఆదివారం ఉదయం వేడుకగా ప్రారంభించారు. ఈ మహోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి 500 మంది దీక్షాధారులచే వాసవీ అగ్ని ప్రవేశం కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. 102 గోత్రికుల హోమాలను ఆలయ ప్రధాన అర్చకులు శిష్టా మణికంఠ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. 102 గోత్రాలతో అమ్మవారికి రజతమాల సమర్పించారు. విశ్వరూప దర్శనం దీక్షా విరమణ ప్రత్యేక హోమాలు చేశారు. మువ్వ గోపాల కల్చరల్ అకాడమి విజయవాడ వారిచే శ్రీ వాసవీ నృత్య నీరాజనం నిర్వహించారు. రాత్రి 7 గంటల సమయంలో వాసవీ మాతకు ప్రత్యేక అష్టాదశ హారతులు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన సుమారు 250 మంది కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

కలశాలతో భక్తుల శోభాయాత్ర



జేఏసీ రాష్ట్ర సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా చైర్మన్ శ్రీనివాస్

14 నుంచి ఉద్యోగుల ఉద్యమ శంఖారావం

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11 : ఆర్థిక బకాయిల చెల్లింపుపై రాష్ట్రప్రభుత్వ దాటవేత ధోరణిని నిరసిస్తూ 'ఉద్యమ శంఖారావం' పేరిట ప్రత్యక్ష పోరాటానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జేఏసీ మరోసారి సిద్ధమైంది. ఆదివారం విజయవాడలో అన్ని జిల్లాల జేఏసీ నాయకులతో నిర్వహించిన రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం వివరాలను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జేఏసీ చైర్మన్ సీహెచ్ శ్రీనివాస్ ఏలూరులో మీడియాకు వివరించారు. సరెండర్ లీవులు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, వైద్యఖర్చుల బిల్లుల రీయింబర్స్‌మెంట్, పోలీసులకు రావాల్సిన సరెండర్ లీవులకు చెల్లింపులు, గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దుకింద జీతాలు, జలవనరుల శాఖలో అవుట్‌సోర్సింగ్ లస్కర్లకు ఏపీ ఆప్కాస్ ద్వారా 12 నెలల జీతాల బకాయిలు, డీఏ బకాయిలు, 11వ పీఆర్సీలో చెల్లించాల్సిన బకాయిలను ఉద్యోగుల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని సమావేశంలో జేఏసీ నాయకులు డిమాండ్ చేశారని వివరించారు. ఈ డిమాండ్ల సాధనకు జేఏసీ రాష్ట్ర కార్యవర్గం తీర్మానించిన ఉద్యమ శంఖారావానికి పూర్తి మద్దతునివ్వాలని అన్ని జిల్లాల ఉద్యోగ సంఘాల నాయకులు నిర్ణయించారని తెలిపారు.

27న చలో విజయవాడ

ఉద్యమ శంఖారావం దశలవారీ పోరాట కార్యక్రమాల వివరాల ను ఏపీ జేఏసీ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్.ఎస్.హరనాథ్ తెలిపారు. ఈనెల 14న ఉమ్మడి జిల్లాలోని అన్ని తాలూకాల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసనలు, తహసీల్దార్/సబ్ కలెక్టర్/కలెక్టర్లకు డిమాండ్లను పరిష్కరించాల్సిందిగా ప్రాతినిధ్యం చేస్తారు. 17న తాలూకా/జిల్లా కేంద్రాల్లో ర్యాలీ, ధర్నా ఉంటాయి. 15, 16 తేదీల్లో భోజన విరామ సమయాల్లో తాలూకా/ పాఠశాలల్లో నిరసన ప్రదర్శనలు, 20న జిల్లా కలెక్టరేట్ల ఎదుట ర్యాలీ, ధర్నా నిర్వహిస్తారు. 27న చలో విజయవాడ ఉద్యమాన్ని నిర్వహిస్తామని ఆంధ్ర ప్రదేశ్ ఐక్య కార్యా చరణ సమితి తీర్మానించిందని వివరించారు.



ధిక్కార స్వరం



వైసీపీలో అసమ్మతి సెగలు
ఎన్నికల్లో ఓడిస్తామంటూ శపథాలు
పార్టీకి దూరంగా ఉంటున్న కేడర్
మంత్రుల ఇలాకాల్లోనూ వర్గ పోరు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీలో అసమ్మతి స్వరాలు కాక పుట్టిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార పార్టీ నేతలు అసమ్మతితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లాలోని ప్రతినియోజకవర్గంలోనూ ఇదే సమస్య వెంటాడుతోంది. అభ్యర్థుల ఖరారు విషయంలో అధిష్ఠానం రోజుకో ప్రతిపాదన తెరపైకి తెస్తోంది. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో మంత్రి కొట్టు సత్యనారాయణకు టిక్కెట్టు ఇచ్చినట్టయితే పార్టీని వీడతామంటూ కొందరు నాయకులు అధిష్ఠానానికి సంకేతాలు పంపారు. తెలుగుదేశం పార్టీతో సంప్రదింపులు జరుపుతున్నారు. వైసీపీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది తిరగక ముందే తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో అసంతృప్తి బహిర్గతమైంది. కొందరు నాయకులు పార్టీకి దూరంగా ఉంటున్నారు. వారిని కూడా అధిష్ఠానం ప్రోత్సహిస్తూ వచ్చింది. అసంతృప్తికి గల కారణాలను చక్కదిద్దలేక పోయింది. నియోజకవర్గంలో సయోధ్య కుదర్చలేక పోయింది. ఇప్పుడు అభ్యర్థి ఖరారు విషయంలో అధిష్ఠానం ఊగిసలాడుతోంది. తాడేపల్లి గూడెం నియోజకవర్గంలో పార్టీ ఎదురీదుతోందంటూ అధిష్ఠానానికి నివేదికలు వెళ్లాయి. దాంతో ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషిస్తోంది. కొద్దిరోజుల క్రితమే పార్టీకి చెందిన కొందరు కీలక నాయ కులు సమావేశమయ్యారు. తెలుగుదేశం కూటమిలో తమకు అనుకూలమైన అభ్యర్థికి టిక్కెట్ ఇస్తే వైసీపీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు.పార్టీని కాదని తన సొంత అనుచరులకే తాడేపల్లిగూడెంలో పదవులు కట్టబెడుతున్నారన్న అసంతృప్తి ఇప్పుడు నేతల్లో నెలకొంది.

రంగరాజుపై ధిక్కారం

ఆచంట నియోజకవర్గంలో అధికార పార్టీలో ఒక్కసారిగా అసంతృప్తి పెల్లుబికింది. ఎమ్మెల్యే రంగరాజుకు టిక్కెట్ ఇస్తే ఓడిస్తామంటూ శపథం పూనారు. ఇప్పటిదాకా చాపకింద నీరులా ఉన్న అసంతృప్తి ఇప్పుడు బహిర్గతమైంది. మరోవైపు పలు గ్రామాల్లో కేడర్ వైసీపీని వీడి మాజీమంత్రి పితాని సమక్షంలో తెలుగుదేశంలో చేరింది.పార్టీని నమ్ముకుని నష్టపోయామంటూ కార్యకర్తలు, క్రియాశీల నాయకులు ఇప్పుడు రంగరాజుపై కారాలు మిరియాలు నూరుతున్నారు. నియోజకవర్గంలో ఓ బలమైన సామాజిక వర్గానికి చెందిన నాయకులు ఈ సారి ఆచంట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వాలని తీర్మానించుకున్నారు.

కినుక వహించిన కీలక నేతలు

తణుకు నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఏమంత అనుకూల పరిస్థితులు కానరావడం లేదు. ఆ పార్టీకి చెందిన కీలక నేతలు ఇప్పటికే మంత్రి కారుమూరికి దూరంగా ఉన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లో మంత్రికి ఆర్థిక వ్యవహారాలపై చేదోడుగా ఉన్న కీలక నాయకుడు ఇప్పుడు పార్టీకి దూరమయ్యారు. తణుకు ఏఎంసీ పాలకవర్గంలో ముఖ్య బాధ్యతలు వహించిన నాయకులు, మున్సిపాలిటీకి ప్రాతినిధ్యం వహించిన వారంతా ప్రస్తుతం అధికార పార్టీకి దూరమయ్యారు.మంత్రి వ్యవహార శైలితో ఇమడలేక పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. గత ఎన్నికల్లో మంత్రి గెలుపుకోసం శ్రమించిన బీసీ నాయకుడు ఇది వరకే తెలుగుదేశంలో చేరిపోయారు. మంత్రిని ఓడించడమే ధ్యేయమంటూ తెలుగుదేశం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన శపథం చేశారు. ఇలా తణుకు నియోజక వర్గంలోనూ అసంతృప్తి రాజ్యమేలుతోంది. వైసీపీని వీడి అనేకమంది నాయకులు తెలుగుదేశం గూటికి చేరుతున్నారు.

పాలకొల్లు కేడర్‌లో అయోమయం

పాలకొల్లు నియోజకవర్గంలో అధిష్ఠానమే మీమాంసలో పడింది. గతంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌కు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించింది. అక్కడ ఇతర నేతలు ఉన్నాసరే పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇటీవల శ్రీనివాస్‌ను తప్పించి గుడాల గోపికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించింది. ఇలా నేతలను మారుస్తుండడంతో కేడర్ అయోమయంలో పడిపోయింది. చివరి వరకు అధిష్ఠానం ఏమి చేస్తుందనే దానిపై స్పష్టత లేకపోవడంతో కేడర్ కినుక వహించింది. మరోవైపు కొందరు నాయకులు తెలుగుదేశం గూటికి చేరుతున్నారు.

మాకేంటి ?

నర్సాపురంలో మాజీమంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడుతో వైసీపీ అసంతృప్తి నేతలంతా వెళ్లిపోయారు. ఇక మిగిలిన వారంతా గడచిన ఐదేళ్లలో తమకు ప్రభుత్వ పరంగా, పార్టీ పరంగా చేసిందేమీ లేదంటూ బాధతో ఉన్నారు. వైసీపీలో అప్పులు పాలయ్యామంటూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఘొల్లుమంటున్నారు. వారంతా రానున్న ఎన్నికల్లో ఏమి చేస్తారనే విషయం ఆసక్తిగా మారింది. భీమవరం నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి. కేడర్‌కు ఒరిగిందేమీ లేదు. ఎమ్మెల్యే గ్రంధికి వ్యతిరేకంగా ఉన్న వారంతా నియోజకవర్గంలో మరో కీలక నేత వద్దకు వెళుతున్నారు. మొత్తంపైన కేడర్‌లో సఖ్యత కొరవడింది.ఉండి నియోజకవర్గంలో పీవీఎల్‌పైనే అధిష్ఠానం బాధ్యతలు పెట్టింది. అయితే అదే నియోజకవర్గంలో యువజన నాయకునికి పీవీఎల్‌కు పొంతన కుదరడం లేదు. యువజన నాయకునికి పాలకోడేరు మండలంలో పట్టు ఉంది. ఇలా కీలక నాయకుల మధ్య సఖ్యత లేకపోవడంతో వైసీపీకి కేడర్ దూరంగా ఉంటూ వస్తున్నారు.

సిద్ధాంతంలో ఆచంట ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సమావేశం



పెనుగొండ, ఫిబ్రవరి 11: ఆచంట ఎమ్మెల్యే రంగనాథరాజు ఒక నటుడని నియోజకవర్గంలో ఓటుతో గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడ్డాయని వైసీపీ సీనియర్ నాయకులు కడలి రామనాగ గోవిందరాజు, వైట్ల కిషోర్ అన్నారు. ఆదివారం సిద్ధాంతంలో నియోజకవర్గ స్థాయిలో వైసీపీ అసమ్మతి నాయకులు సమావేశం నిర్వహించారు. పలువురు వైసీపీ అసమ్మతి నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే రంగనాథరాజు నియోజకవర్గంలో నాయకులకు, కార్యకర్తలకు కనీస గుర్తింపు లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనుసరిసున్న విధానాలు ఇబ్బందిగా ఉన్నాయని ఆరోపించారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా రంగనాథరాజును గెలిపించామని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేకు గుణపాఠం చెబుతామన్నారు. ఆయన ఏ సామాజిక వర్గ నాయకులతోను గౌరవంగా మాట్లాడలేదన్నారు. సీఎం జగన్‌కు చెడ్డ పేరు తెచ్చిన నాయకుడు రంగనాథరాజు అన్నారు. ఆయన వల్ల నియోజకవర్గంలో ప్రతీ గ్రామంలోనూ వైసీపీ రెండు గ్రూపులుగా మారిపోయిందన్నారు.



కంచుస్తంభంపాలెంలో నిమ్మల, అంగర పాదయాత్ర



ఆచంటలో పితానికి మహిళల హారతులు

పాదయాత్రకు నీరాజనాలు

రాష్ట్రాభివృద్ధికి టీడీపీ-జనసేనలను ఆశీర్వదించాలి : నిమ్మల

యలమంచిలి, ఫిబ్రవరి 11: రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను ప్రజలంతా ఆశీర్వదించాలని పాలకొల్లు ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు కోరారు. కంచుస్తంభంపాలెం, బూరుగుపల్లి గ్రామాల్లో మన పాలకొల్లు-మన రామానాయుడు పాదయాత్ర నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, టీడీపీ, జనసేన శ్రేణులు, మహిళలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీజనల్‌గా వచ్చే నాయకులను నమ్మవద్దని, వైసీపీలో ఇప్పటికే నలుగురు వచ్చారని ఎద్దేవా చేశారు. అన్నివర్గాల ప్రజలను జగన్ ప్రభుత్వం ఏ విధంగా మోసం, దగా చేసిందో వివరించారు. ఎమ్మెల్యే నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగరలకు గ్రామాల్లో మహిళలు హారతు లిచ్చి, నుదుట కుంకుమ దిద్ది విజయం మీదేనంటూ ఆశీర్వదించారు. టీడీపీ- జనసేన కూటమి విజయాన్ని ఆకాంక్షిస్తూ సీహెచ్.సూర్యప్రసాద్ రచించగా కడలి గోపి రూపొందించిన వీడియో సీడీని ఎమ్మెల్యే నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర ఆవిష్కరించారు.

అరాచపాలకుడిని ఓడించాలి : పితాని

ఆచంట, ఫిబ్రవరి 11: ఆచంటలో సాగుతున్న అరాచకపాలకుడిని ఎన్నికల కురుక్షేత్రంలో ఓడించాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం ఆచంటలో బాలంవారిపాలెం, రావిగుంటలో పితాని పాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ ఆచంటలో అరాచకపాలన జరుగుతున్నదని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే రంగనాథరాజు కుల ద్రోహి అని అన్నారు. ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు చేపల పులుసు, వేట మాంసం, కోడికూర బిర్యానీలు వడ్డిస్తూ అప్యాయత ఉన్నట్లుగా కపట వేషధారణ చేస్తున్నారని అన్నారు. అవినీతి పరుడు, అరాచక పాలకుడైనా రంగనాథరాజును గద్దె దించి ప్రజా స్వామ్యం పరిరక్షించాలని కోరారు. పాదయాత్రలో నియోజకవర్గ పరిశీలకులు రుద్రరాజు వెంకట రామరాజు, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమత సూర్యకుమారి, గొడవర్తి శ్రీరాములు, జవ్వాది బాలాజీ, యర్రగొప్పుల నాగరాజు పాల్గొన్నారు.

అన్నదాతకు మొండిచేయి

తుఫాన్ నష్టపరిహారం ఏదీ ?
రెండు నెలలైనా ఆ ఊసే లేదు
12,438 హెక్టార్లలో పంట నష్టం
ధాన్యం కొనుగోలులో ఇంకా దోపిడీనే..



ధాన్యంతో నాలుగు రోజులుగా నిలిచిన ట్రాక్టర్

ఇటీవల తుపాన్ దెబ్బకు రైతులు మొత్తం నష్టపోయారు.. పెట్టుబడు కూడా దక్కని రైతులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం పంట నష్టం అంచనాలు వేసింది.. ఇదిగో పరిహారం అంటూ ఊరించింది. నెలలు దాటుతున్నా ఆ ఊసే లేదు.. తుఫాన్ నష్టపరిహారం మాట సర్కారు మరిచి పోయిందేమో..? మరో వైపు ధాన్యం కొనుగోలులో ఇంకా కొర్రీలే.. అవకాశం చిక్కితే మిల్లర్లు చేతివాటం చూపిస్తున్నారు. అధికారులు పట్టించుకోరు.. ఇదీ.. జగన్ ప్రభుత్వం రైతన్నలకు చేసింది..

భీమవరం రూరల్, ఫిబ్రవరి 11 : పంట నష్టపోయిన రైతులకు సంక్రాంతి పండుగకి ఇస్తానన్న తుఫాన్ నష్టపరిహారం అందించలేదు. దాని ఊసే లేదు. గత ఏడాది డిసెంబరు మొదటి వారంలో వచ్చిన మిచౌంగ్ తుఫాన్‌తో జిల్లాలో వరి సాగు 50 వేల హెక్టార్లలో దెబ్బతిన్నది. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు 12,438 హెక్టార్లలో సాగుకు నష్టం వాటిల్లినట్లు నమోదు చేశారు. ఆ లెక్క ప్రకారం ఎకరానికి రూ.6,800 ఇన్‌పుట్ సబ్సిడీగా దాదాపుగా రూ.20 కోట్లు పైన రైతులకు తుఫాన్ నష్టపరిహారం కింద అందాల్సి ఉంది. నష్టం అంచనా సమయంలో ప్రభుత్వం సంక్రాంతి పండుగకి ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తామని చెప్పింది. నష్టం జరిగి రెండు నెలలు అయింది. ప్రభుత్వం ఇస్తానన్న తేదీ దాటి నెల అయ్యింది. దాళ్వా పెట్టుబడులకైనా సొమ్ములు వస్తాయని ఎదురుచూసిన రైతులకు నిరాశే మిగిలింది. ఉద్యావన పంటలకు తుఫాన్ నష్టం తప్పలేదు. జిల్లాలో 214.6 హెక్టార్లలో నష్టంలో కూరగాయలు, 167 హెక్టార్‌లలో అరటి దెబ్బతిన్నట్లు నమోదు చేశారు. నష్టపరిహారంగా రూ.50.16 లక్షలు అందాల్సి ఉంది. ఆ సొమ్ములు రైతులకు అందలేదు.

ధాన్యం కొనుగోలులో అదే తీరు..

ధాన్యం కొనుగోలులో జగన్ ప్రభుత్వంలో కొత్త విధానం అమలులోకి వచ్చింది. గతంలో రూ.5 గాని రూ.10 గాని మద్దతు ధరలో మిల్లర్లు కోత వేసేవారు. గతేడాది దాళ్వా పంట నుంచి ధాన్యంలో కోత విధానం పెట్టారు. మిల్లరు అవకాశాన్ని బట్టి ఎన్ని కేజీలు తగ్గాలో నిర్ణయిస్తారు. ఆ పంటలో బస్తాకు 5 కేజీల కోత వరకు సాగింది. ఈ సార్వాలో ప్రస్తుతం ఏకంగా బస్తాకు 10 కేజీలు కోత విధిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం వీరవాసరం మండలం నుంచి పాలకొల్లు మిల్లుకు వెళ్ళిన ధాన్యం లోడును మిల్లరు బస్తాకు 10 కేజీలు తగ్గించి తీసుకుంటానని అడగడంతో రైతు ఇవ్వలేదు. దీంతో ధాన్యం దిగుమతి అవ్వకుండా ట్రాక్టర్ మీదే ఉంది. దీనిపై వ్యవసాయశాఖ ఏవో ట్రక్ సీటు మారుద్దామని రైతుకు చెప్పారట. కానీ మిల్లర్‌తో మాత్రం మాట్లాడలేదని బావురుమన్నారు. ఇదొక్కటే కాదు.. గడచిన సార్వా పంట ధాన్యం కొనుగోళ్ళలో కోతలు తప్పలేదు.

బస్తాకు పది కేజీల కోత



ధాన్యం బాగుంది.. అయినా బస్తాకు 10 కేజీలు తగ్గించి కొనుగోలు చేస్తామన్నారు. అదేమిటి అడిగితే నీ ధాన్యం నాకు అవసరం లేదని చెప్పారు. నాలుగు రోజుల నుంచి ట్రాక్టర్‌తో ధాన్యం అలా ఉండి పోయింది. ట్రాక్టర్ కిరాయి చెల్లించాల్సి వచ్చింది. దీనిపై స్పందనలో ఫిర్యాదు చేశాను. - **వై.శివ, రైతు, బాలేపల్లి**

సొమ్ము పోయె.. పరువూ పోయె..





పందెం రాయుళ్లు లబో..దిబో
నిర్వాహకులపై గరం..గరం
మల్లవరం పందేల వెనకున్నదెవరు ?
అధికార పార్టీలో జోరుగా చర్చ
పోలీసుల విచారణ.. తీరంలో హాట్ టాపిక్

నరసాపురం, ఫిబ్రవరి 11: "కోడి పందాలు వేస్తున్నాం.. పోలీసుల భయం ఉండదు... అంతా వాళ్లిద్దరూ చూసుకుంటారు...అన్నీ పెద్ద పందేలే...అంటూ ఫోన్‌లు చేశారు.. వారి మాటలు విని వస్తే చివరికి పోలీసులకు చిక్కాం.. డబ్బు పోయే.. పరువు పోయె.. పంట పొలాల్లో పరుగులు తీయాల్సి వచ్చింది..అంటూ పందెం రాయుళ్ల ఆవేదన చెందుతున్నారు.

వారం రోజుల క్రితం నరసాపురం మండలం మల్లవరంలంకలో కోడి పందాలపై పోలీసుల జరిపిన దాడి ఇప్పుడు అధికార పార్టీలో పెద్ద చర్చనీయాంశమైంది. ఈ బరుల వెనుక ఉన్నదెవరు.. అన్నది హాట్‌టాపిక్‌గా మారింది. ఇటు పార్టీ అధిష్ఠానం కూడా దీనిపై ఆరా తీస్తున్నట్లు ఆ పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. సబ్ డివిజన్ పోలీస్‌స్టేషన్‌కు పది కిలోమీటర్ల దూరంలో ఫ్లడ్‌లైట్ల కాంతుల్లో కోడి పందాలు నిర్వహించారంటే దీని వెనుక పెద్దల హస్తమే ఉందన్న వాదనలు లేకపోలేదు. మరోవైపు పట్టుబడిన పందెం రాయుళ్ల నిర్వాహకుల్ని నిలదీస్తున్నారు. మీ మాటలు నమ్మి వచ్చాం...డబ్బు పోయింది.. పరువు పోయింది... పట్టుకున్న కోళ్ళు, మా సొమ్ము తెచ్చి ఇవ్వకపోతే ఊరుకోమంటూ ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పోలీసుల దాడిలో చిక్కిందెంత... చూపించిందెంత ? అన్న చర్చ కూడా జోరుగా సాగుతోంది. దీనిపై ఆ శాఖ ఉన్నతాధికారులు కూడా లోతైన విచారణ చేస్తున్నారు. జిల్లా నుంచే కాకుండా సరిహద్దునున్న కృష్ణా, కోనసీమ జిల్లాల నుంచి పందెం రాయుళ్లు వచ్చారు. అయితే పట్టుబడింది 23 మందే.. దొరికింది కూడా రూ 4.89 లక్షలే. దాడికి ముందు పోలీసుల్లో పెద్ద చర్చ సాగింది. ఇది పాలకొల్లు సరిహద్దు అని, నరసాపురం పోలీసులు దాటవేసే ప్రయత్నం చేశారు.. ఇటు పాలకొల్లు పోలీసులు కూడా మా పరిధిలో లేదంటూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. చివరికి ఇద్దరూ సంఘటన ప్రదేశానికి వచ్చి నరసాపురం రూరల్ పరిధి అని నిర్ధయించారు. గ్రామానికి సమీపంలో ఇంత పెద్ద బరి నిర్వహిస్తుంటే డివిజన్ కేంద్రానికి సమాచారం లేకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తున్నది. అయితే ఈ బరి ఎన్నిరోజుల నుంచి సాగుతోందన్న దానిపై కూడా పోలీస్ బాస్‌లు ఆరా తీసినట్లు తెలుస్తున్నది. మరోవైపు యలమంచిలి, పాలకొల్లు మండలాలకు చెందిన ఇద్దరు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే ఈ బరి నిర్వహించా రన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. వీరికి జిల్లాకు చెందిన ఒక నాయకుడు అండదండలు కూడా ఉన్నట్లు ఆ పార్టీలోనే చర్చ సాగుతోంది. ఎన్నికల సమయంలో ఇటువంటివి నిర్వహించడంపై పార్టీ పెద్దలు సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. ఈనేపథ్యంలో పోలీసులు జరిపిస్తున్న విచారణ, పట్టుబడినవారు చేస్తున్న రచ్చ ఎటు దారి తీస్తుందన్న చర్చ ఆసక్తికరంగా మారింది.



పట్టుబడిన వాహనాలు


భీమడోలు జంక్షన్‌లో సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ధర్మరాజు, తదితరులు

పవన్ బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

భీమడోలు, ఫిబ్రవరి 11 : త్వరలో భీమడోలు, గణపవరం ప్రాంతాల్లో జరిగే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బహిరంగ సభ ఏర్పాట్లకు భీమడోలు జంక్షన్‌లోని సభాప్రాంగాణాన్ని జనసేన నేతలు ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా జోన్-2 కో-కన్వీనర్ చిక్కాల వేణు, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు తోట పవన్, అనిల్ కుమార్, ఉంగుటూరు ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు, భీమడోలు మండల అధ్యక్షుడు ప్రత్తి మదన్ తదితరులు పాల్గొన్నారు.

'చెస్‌తో చిన్నారుల్లో మేధాశక్తి పెంపు'


చెస్ విజేతలకు బహుమతులు అందిస్తున్న గూడూరి ఉమాబాల, గ్రంధి రవితేజ

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 11: చెస్ క్రీడ వల్ల చిన్నారులలో మేధాశక్తి పెరుగుతుందని నరసాపురం పార్లమెంటు వైసీపీ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల అన్నారు. భీమవరంలో జరిగిన గ్రంధి వెంకటేశ్వరరావు స్మారక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓపెన్ చదరంగ పోటీల విజేతలకు లక్ష రూపాయల నగదును గూడూరి ఉమాబాల చేతుల మీదుగా అందించారు. ఈ పోటీలలో 20 జిల్లాల నుంచి సుమారు 167 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి బహుమతి కోనసీమ జిల్లాకు చెందిన సింహాద్రి సాయి రుషికేష్, రెండో విన్నర్‌గా తూర్పుగోదావరి జిల్లా భార్గవ్ సుశాంత్ సాకేత్, మూడో విజేతగా తూర్పుగోదావరి జిల్లా టీవీఎస్ కావ్యశ్రీ, నాలుగో విజేతగా కోనసీమ జిల్లా డి.సాత్విక్, ఐదో విన్నర్‌గా తుర్పుగోదావరి చెందిన కె.సీతాసాగర్, ఆరో విజేతగా గుంటురు జిల్లా ఎ.నాగశివసాయి దివ్య, ఏడో విజేతగా కోనసీమ జిల్లా కె.రాజేశ్, ఎనిమిదో విజేతగా ఎన్టీఆర్ జిల్లా ఎన్.ప్రీతమ్, తొమ్మిదో విజేతగా గుంటూరు జిల్లా టి.నాగఉదయ్‌అనురాగ్, పదో స్థానంలో గుంటూరు జిల్లా టి.శ్రీలాస్య విజేతలుగా నిలిచారు. వీరికి లక్ష రూపాయల నగదు అందించినట్టు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. బహుమతుల ప్రదాన కార్యక్రమంలో భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు రవితేజ, చెస్ అసోసియేషన్ సభ్యులు తోట బోగయ్య, ఎస్.భీమారావు, తోట హరిబాబు, ఎం.మురళి పాల్గొన్నారు.

నేడు ఉద్యోగుల సమస్యలపై జేఎస్‌సీ సమావేశం

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11 : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఈనెల 12న మధ్యాహ్నం 3.30 గంటలకు ఏపీ సెక్రటేరియట్‌లో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్(జేఎస్‌సీ) సభ్య సంఘాల సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వం నుంచి సమాచారం అందిందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు కేంద్రప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పాతపెన్షన్ విధానం అమలు, సీపీఎస్/జీపీఎస్‌ల స్థానే ఓపీఎస్, 12వ పీఆర్సీ అమల్లోపు 30 శాతం మధ్యంతరభృతి (ఐఆర్), ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) లోపాలు, డీఎస్సీ-2024 నోటిఫికేషన్‌లో ఉపాధ్యాయ పోస్టుల పెంపుదల, హైస్కూల్ ప్లస్‌లలో ఇంటర్ విద్యను బోధిస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు ఇంక్రిమెంట్ల మంజూరు, చిన్నపాటి తప్పులకు కూడా టీచర్లను సస్పెండ్ చేస్తామని విద్యాధికారుల బెదిరింపులు, టీచర్లను సమాజంలో చులకనచేసేలా అధికారులు వ్యవహరిస్తుండటం తదితర అంశాలను సమావేశంలో లేవనెత్తుతామని వివరించారు.

త్రిమూర్తి స్వరూపుడు విద్యారణ్య మహర్షి

» ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు


ప్రవచనాలు చెబుతున్న గరికిపాటి నరసింహారావు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 11 : విద్యారణ్య అంటే అరణ్యం వంటి జ్ఞానం కలవారని అర్థం అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు అన్నారు. భీమవరం స్థానిక ఆనంద ఫంక్షన్ హాలులో మూడు రోజులుగా జరుగుతున్న గరికిపాటి వారి 'విద్యా అరణ్య మహర్షి విరచిత ప్రవచనాలు' ముగింపు సభలో ఆదివారం ఆయన మాట్లాడారు. విద్యారణ్య మహర్షి 1331లో సన్యాసం స్వీకరించిరి. శృంగేరి పీఠంనకు శంకరాచార్యుని తరువాత ఐదు దశాబ్దాల తరువాత పీఠాధిపతి అయ్యారని, గొప్ప విద్వాంసులు, గొప్పయోగి అని శంకరాచార్యులు తరువాత మళ్లీ శంకరాచార్యులు అంతటి వారనిపించుకున్నారన్నారు. విద్యారణ్య స్వామి 1386లో శివైక్యం చెందారని తెలిసి చింతించి వారి పేరున ఒక అగ్రహారానికి విద్యారణ్యపురం అని పేరు పెట్టారని, విద్యారణ్య మహర్షి ఒక బ్రహ్మగా, విష్ణువుగా, శివుడుగా హరిహర బుక్కరాయులు వర్ణించారని, ధర్మాన్ని రక్షించే మహాత్ములు అని మహర్షి చెప్పినట్టు గుర్తు చేశారు. తొలుత గరికిపాటి నరసింహారావు ఫౌండేషన్ చైర్మన్ యూకే విశ్వనాథరాజు, కంతేటి వెంకటరాజు, బొమ్మిడి నారాయణరావు, చంద్రజీ జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం పద్మశ్రీ గరికిపాటి నరసింహారావును సత్కరించారు, సభలో ఆనందరాజు కుటుంబ సభ్యులు జోగి రాజు, రామభద్రరాజు, ధార్మిక పరిషత్ సభ్యులు రామ్‌కుమార్‌రాజు, రంగరాజు లక్ష్మణ వర్మతో పాటు పురప్రముఖులు పాల్గొన్నారు

యజమాని కొట్టాడని బాలుడి అదృశ్యం

» ఆచూకీ తెలుసుకున్న పోలీసులు.. తల్లికి అప్పగింత

» గాయాలుండడంతో ఆసుపత్రికి తరలింపు.. ఎమ్మెల్సీగా నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 11 : యజమాని కొట్టడంతో ఒక బాలుడు మనస్తాపానికి గురై వెళ్లిపోయాడు. చివరకు పోలీసులు ఆ బాలుడు అదృశ్యం అయ్యాడని కేసు నమోదు చేసి తీసుకువచ్చి తల్లికి అప్పగించారు. ఆ బాలుడు ఏ కారణము చేత వెళ్లాడో చెప్పడంతో అవాక్కయ్యారు. ఆ బాలుడికి గాయాలు ఉండడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి ఆదివారం రాత్రి తీసుకువచ్చి వైద్యులచే పరీక్షలు చేయించి ఎమ్మెల్సీగా నమోదు చేయించారు. ద్వారకాతిరుమలలోని తూర్పువీధినకు చెందిన మీరవరపు శివ(16) 9వ తరగతి వరకు చదివి కొంతకాలం నుంచి ద్వారకాతిరుమల పరిధిలోని మండపాలకు పూల డెకరేషన్ చేసే కాంట్రాక్టర్ గువ్వల నాగబాబు వద్ద పని చేస్తున్నాడు. శివ తండ్రి మరణించడంతో తల్లి చంద్రావతి వద్ద ఉంటున్నాడు. నాగబాబు అతడి భార్య మధ్య మనస్పర్థలు రావడంతో అందుకు కారణం శివే అని భావించి ఈనెల ఒకటిన కొట్టాడని, మళ్లీ 9వ తేదీన కొట్టాడని మనస్తాపానికి గురై తాను పాలకొల్లు మండలం తిల్లపూడి గ్రామంలో ఉన్న నితిన్ వద్దకు వెళ్లానని పేర్కొన్నారు. అతడికి గాయాలు ఉండడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చి ఎమ్మెల్సీగా నమోదు చేశారు. నాగబాబుకు వేరే మహిళతో వివాహేతర సంబంధం ఉందని ఆ విషయం శివకు తెలియడం వల్ల తన భార్యకు చెప్పి ఉంటాడని అనుమానంతో కొట్టినట్టుగా చెబుతున్నారు. ఆసుపత్రి వైద్యులు ఇచ్చిన ఎమ్మెల్సీతో ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులు అతడి నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. ఈ సంఘటనపై ద్వారకాతిరుమల పోలీసులు విచారణ చేపట్టారు.

వేర్వేరుచోట్ల ఆరుగురు జూదరుల అరెస్ట్

టినరసాపురం/ఆకివీడు, ఫిబ్రవరి 11 :టి.నరసాపురంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ డి.దుర్గామహేశ్వర రావు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలివి.. టినరసాపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి మూడు వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. ఆకివీడు మండలం దుంపగడప పోతురాజుకాలనీలో పేకాటాడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ బత్తి న నాగబాబు ఆదివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

ఉండి, ఫిబ్రవరి 11 :భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఉండి పోలీస్‌స్టేషన్ రైటర్ యేషయ్య తెలిపారు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉండి భవానీపేటకు చెందిన మర్రి ప్రసాద్ భార్య మర్రి ఝాన్సీ భర్తపై కోపంతో పెద్దకుమారుడిని ఇంటి వద్ద విడిచిపెట్టి ఎనిమిది నెలల చిన్నకుమారుడుని తీసుకుని వెళ్లిపోయింది. రెండురోజుల పాటు బంధువులు ఇంటి వద్ద ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికి కనిపించ లేదు. భర్త ప్రసాద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే

ఏలూరు జిల్లాలో ప్రసిద్ధ క్షేత్రమైన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నెలకొన్న ద్వారకాతిరుమల గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. గ్రామం చెత్తాచెదారంతో నిండి అపారిశుధ్యం తాండవిస్తుంది. ఇదెక్కడి దారుణం అంటూ అటు స్థానికులు ఇటు క్షేత్రానికి వచ్చిన భక్తులు విమర్శిస్తున్నారు. శ్రీవారు కొలువైన క్షేత్రంలో రహదారులు అధ్వానంగా ఉండడంతో భక్తులు అసహ్యించుకుంటున్నారు.

\- ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమలలో పారిశుధ్యం అధ్వానం

» పంచాయతీ అధికారుల తీరుపై కానరాని విచారణ

» ఆరు నెలలుగా కార్మికులకు జీతాలు రాని వైనం

పారిశుధ్య కార్మికులకు జీతాలు నిల్..

గత ఆరు నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులకు కనికరం లేదు. తెల్లారితే చాలు.. రోడ్లను శుభ్రం చేయడం, మురుగు కాల్వలు బాగుచేయడం వంటి పారిశుధ్యపనులు చేసే కార్మికులకు నెలలు తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో వారు అష్టకష్టాలు పడుతున్నారు. జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల మేజర్ పంచాయతీలో పారిశుధ్య కార్మికుల అవస్థలు ఇవి. పంచాయతీ పరిధిలో 24మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో దేవస్థానం పదిమంది కార్మికులను పంచాయతీకి ఇచ్చింది. ఆ పదిమంది జీతాలను దేవస్థానం ద్వారా పంచాయతీకి వస్తే వాటిని వారికి పంచాయతీ అందిస్తుంది. ఈ 24మంది కార్మికులకు గత ఆరునెలలుగా పంచాయతీ జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబపోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అప్పులు చేసి ఇల్లు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దేవస్థానం ద్వారా వచ్చిన పదిమందిలో ఇద్దరు మానేశారు. మిగిలిన వారు జీతాలు అందక పోయినా బాధను దిగమింగుకుని పనులు చేస్తున్నారు.

అవినీతిపై విచారణ ఏదీ ?

ఈ పంచాయతీలో భారీ అవినీతి జరిగిందని గ్రామానికి చెందిన నిమ్మగడ్డ ఆముక్త ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. పలు పన్నుల రూపంలో వసూలైన సొమ్ము పక్కదారి పట్టిందని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇంటి కుళాయిపన్నుల వసూలు, నాలుగేళ్లుగా బ్లీచింగ్ కొనుగోలులో సుమారు రూ.20లక్షలు గోల్‌మాల్ అయ్యిందని ఫిర్యాదులో పేర్కొంది. పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని, ప్రస్తుతం కార్మికులకు జీతాలు ఇవ్వకుండా చేతులెత్తేశారని పేర్కొంటూ ఫిర్యాదు చేసినా దానిపై ఇంతవరకూ స్పందన లేదని చెబుతున్నారు. ఇప్పటికే చాలాసార్లు ఫిర్యాదులు చేసినా బుట్టదాఖలవుతున్నాయిని, ఇప్పటికైనా ఈ వ్యవహారంపై నిజనిర్ధారణ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


ద్వారకాతిరుమల ప్రధానరహదారి పక్కన పేరుకున్న చెత్త


స్థానిక పెట్రోల్ బంకు పక్కన


చిన్నతిరుపతికి వచ్చే రహదారి పక్కనే చెత్త

పంచాయతీ నిర్లక్ష్యంతో పేరుకున్న చెత్త..

ద్వారకాతిరుమలకు పలు ప్రాంతాల నుంచి భక్తులతో పాటు నిత్యం అధికారులు సైతం ఈ రహదారులపై సంచరిస్తుంటారు. ప్రధాన రహదారి పక్కనే చెత్తాచెదారం పేరుకున్నా ఇక్కడి అధికారులకు చీమకుట్టినట్టయినా లేదు. గ్రామంలో పలు రహదారులు చెత్తతో నిండి ఉన్నాయి. పారిశుధ్యకార్మికులకు జీతభత్యాలు సక్రమంగా ఇవ్వక పోవడంతో వారితో పనులు చేయించుకునేందుకు అధికారులు జంకుతున్నారు. ఇప్పటికైనా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిపించేలా ఉన్నతాధికారులు స్పందించాలని గ్రామస్థులు, భక్తులు కోరుతున్నారు.

వసంత పంచమికి 'వీరంపాలెం క్షేత్రం' సిద్ధం

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 11: చిన్నారులకు అక్షరాభ్యాస వేడుకలకు ఎంతో ప్రతిష్ఠాత్మక దినంగా భావించే ఈనెల 14న నిర్వహించే వసంత పంచమి వేడుకలకు తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రం సిద్ధమవుతోంది. బాసరలో సరస్వతి అమ్మవారి ఆలయంలో అక్షరాభ్యాసాలు చేసే మాదిరిగా ప్రతీ ఏటా సరస్వతి, దక్షిణామూర్తి సమక్షంలో తమ చిన్నారులకు పవిత్ర పర్వదినం రోజున అక్షరాభ్యాసాలు చేస్తే మంచి విద్యాబుద్ధులు అబ్బుతాయని పీఠం వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణ సిద్ధాంతి వివరించారు. వేలాదిగా వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు.


వీరంపాలెంలో అక్షరాభ్యాసాలకు ఏర్పాట్లు (ఇన్‌సెట్‌లో) సరస్వతి అమ్మవారు

అతిరుద్ర మహాయాగం ప్రారంభం


కవిటం మహాయాగంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

పోడూరు, ఫిబ్రవరి 11: కవిటంలో శ్రీఉమా రామలింగేశ్వరరావు, శర్వాణి స్కూల్ ఆధ్వర్యంలో 14 రోజుల పాటు నిర్వహించనున్న అతిరుద్ర మహాయాగం ఆదివారం ప్రారంభమైంది. ముందుగా విఘ్నేశ్వరపూజతో యాగం ప్రారంభమైంది. ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు మహాయాగంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ మహోత్సవాల్లో భాగంగా సోమవారం కాణిపాకం శ్రీసిద్ధి బుద్ధి సమేత వరసిద్ధివినాయక స్వామి దివ్య లీలా కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అంతర పంటలతో అధిక ఆదాయం


పంగిడిగూడెంలో కోకో గెలను పరిశీలిస్తున్న తిరుపాల్ రెడ్డి తదితరులు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 11: అంతర పంటలతో రైతులు అధిక ఆదాయాన్ని పొంద వచ్చని రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారు తిరుపాల్‌రెడ్డి అన్నారు. మండ లంలోని వెంకటకృష్ణాపురం, పంగిడిగూడెం గ్రామాల్లో రైతులు వేసిన పలు పంటలను, డ్రిప్ విధానాన్ని ఆయన పరిశీలించారు. ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించి సాగులో మెలకువలను రైతులకు సూచించారు. అనంతరం కొబ్బరి, కోకో, వక్క, జాజికాయ పంటలను అంతర పంటలుగా సాగుచేయ డాన్ని గుర్తించి రైతులను అభినం దించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖాధికారి రామ్మోహన్‌రావు, భీమడో లు ఏడీఏ శైలజ, మండల ఏవో దుర్గారమేశ్ పలువురు రైతులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో పూజలు

చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు తిరుపాల్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయ అర్చకుల నుంచి వేదాశీర్వచనం, ఏఈవో మెట్టపల్లి దుర్గారావు నుంచి శ్రీవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను పొందారు.

క్రైం కార్నర్ వేర్వేరుచోట్ల ఎనిమిది మంది మృతి

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో వేర్వేరు చోట్ల ఆదివారం మొత్తం ఎనిమిది మృతి చెందారు. శుభలేఖలు అందించేందుకు వెళ్లిన పెళ్లికొడుకు దెందులూరు మండలంలో మృతి చెందాడు. పోలవరం మండలంలో ఆటో ట్రాక్టర్ ఢీకొని ఒకరు, రామసింగవరంలో విద్యుదాఘాతంతో వలంటీర్ దుర్మరణం. గుండుగొలనుకు చెందిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందారు. జీలుగుమిల్లి మండలంలో రోడ్డు ప్రమాదంలో మహిళ, ఉండి మండలంలో మోటారు సైక్లిస్టు, పురుగుల మందు తాగి వృద్ధుడు, తాడేపల్లిగూడెంలో యువకుడు మృతి చెందారు.

ఆటో ట్రాక్టర్ ఢీ.. ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో నుజ్జయిన ఆటో

పోలవరం, ఫిబ్రవరి 11 : ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలైన ఘటన పట్టిసీమ పంచాయతీ వెంకటాపురంలో శనివారం రాత్రి జరిగింది. పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాలివి.. పోలవరం మండలం ప్రగడపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శీలం రాంబాబు అదే గ్రామానికి చెందిన పెనుబాక లక్ష్మి, నిడదవోలు గ్రామానికి చెందిన మెరుపో రమణమ్మ(45)ఆటోలో తాళ్ళపూడి ఆస్పత్రికి బయలుదేరగా మార్గమధ్యలో చెరుకు ఫ్యాక్టరీ సమీపంలోకి వచ్చేసరికి పోలవరంవైపు నుంచి వేగంగా వెళుతున్న ట్రాక్టర్ ఢీకొని ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు 108 వాహనంలో పోలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం కాకినాడ సిఫారసు చేశారు. మార్గమధ్యలో రమణమ్మ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వలంటీర్ మృతి


వలంటీర్ మృతదేహం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 11: విద్యుదాఘాతంతో ఓ వలంటీర్ మృతి చెందిన ఘటన రామసింగవరంలో శనివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన ఓగిరాల నరసింహారావు(35) గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. దీనిలో భాగంగా అతడు సొంత ఇంటిని కట్టుకునే క్రమంలో పక్కనే ఓ గుడిసె వేసుకుని అందులో శనివారం రాత్రి ఫ్యాన్‌ను బిగిస్తున్నాడు. ఈక్రమంలో చేతికి వైరు తగిలి షాక్‌కు గురై మృతిచెందాడు. అతడికి ఇంకా వివాహం కాలేదు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భీమడోలు, ఫిబ్రవరి 11 : భీమడోలు మండలం గుండుగొలను గ్రామంలో మద్యానికి బానిసై భార్య మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గుండుగొలనుకు చెందిన తలారి కొండయ్య (47) కూలి పనులు చేసుకుని జీవిస్తున్నాడు. మద్యానికి బానిసై గత నెల 19వ తేదీన భార్యను మద్యం కోసం సొమ్ములు అడుగగా లేవని చెప్పడంతో ఆమెతో గొడవపడి ఇంట్లో ఉన్న కలుపు మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశారు. చికిత్స నిమిత్తం ఏలూరు, తొలుత విజయవాడ తరలించగా ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీనిపై బంధువుల ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 11 : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన పండువారిగూడెం వద్ద జరిగింది. తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట శివారు దొంతికుంట గ్రామానికి చెందిన పచ్చినీల జ్యోతి(37) భర్త రాజాతో కలసి ఆదివారం జంగారెడ్డిగూడెం మండలం బయ్యనగూడెం శుభకార్యానికి బైక్‌పై వెళ్లారు. తిరగి ఇంటికి వచ్చే క్రమంలో దర్భగూడెం సమీప పండువారిగూడెం జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు బైక్ నుంచి జారిపడింది. ఈ ప్రమాదంలో తలభాగం రోడ్డుకు తగలడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది.

వాహనం ఢీకొని మోటారు సైక్లిస్ట్ మృతి

» మరో వ్యక్తికి తీవ్రగాయాలు

ఉండి, ఫిబ్రవరి 11 : ఓ వాహనం ఢీకొని మోటారు సైక్లిస్టు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి తీవ్ర గాయాలైన ఘటన ఉండి మండలం యండగండిలో జరిగింది. ఉండి పోలీసులు తెలిపిన వివరాలివి.. భీమవరం నుంచి అత్తిలికి మోటారుసైకిల్‌పై వెళ్తున్న చిన్నంపల్లి రామ్మూర్తి(45), ములగాల జగదీష్‌లను ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో మోటారుసైక్లిస్టు రామమ్మూర్తి అక్కడే మృతిచెందాడు. గాయపడిన మరొక వ్యక్తి జగదీష్‌ను భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉండి ఎస్ఐ లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

ఉండి, ఫిబ్రవరి 11 : కీళ్లనొప్పులు, అరికాలు పోట్లను భరించలేక మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. ఆదివారం ఉండి పోలీసులు తెలిపిన వివరాలివి.. వాండ్రం గ్రామానికి చెందిన బోను సూర్యనారాయణ(75) కీళ్లనొప్పులు, అరికాలు పోట్లు భరించలేక మద్యంలో పురుగుల మందును కలుపుకుని శనివారం రాత్రి తాగాడు. ఉదయం అతడి నోటి నుంచి నురుగ రావడంతో కుటుంబసభ్యులు భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో మృతి చెందగా పోస్టుమార్టం నిర్వహించినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

పెళ్లింట విషాదం

శుభలేఖలు ఇచ్చేందుకు వెళుతూ..

ఆగిన లారీని ఢీకొట్టి పెళ్లికొడుకు మృతి


కొమిరేపల్లి వద్ద రోడ్డు ప్రమాద దృశ్యం

దెందులూరు, ఫిబ్రవరి11 : ఓ పెళ్లికొడుకు పదిరోజుల్లో పెళ్లి జరుగుతుందనే ఆనందంలో పెళ్లికుమార్తె ఇంటికి శుభలేఖలు ఇచ్చేందుకు వెళ్తూ ఆగి ఉన్న లారీని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. దెందులూరు పోలీసులు తెలిపిన వివరాలివి.. విజయవాడ సిటి పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన షేక్ ఫరీద్(22)కు నిడదవోలుకు చెందిన యువతితో జనవరిలో పెళ్లి చూపులు పూర్తి కాగా ఈనెల 21న వివాహం నిర్ణయించుకున్నారు. ఆదివారం ఉదయం నిడదవోలులోని పెళ్లికుమార్తె ఇంటికి శుభలేఖలు ఇచ్చేందుకు మోటారు సైకిల్‌పై వెళ్తూ 16వ నంబరు హైవే కొమిరేపల్లి సమీపంలో తాడేపల్లిగూడెం వైపు వెళ్తున్న లారీ అప్పటికు ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈమేరకు కారు డ్రైవర్.. లారీ డ్రైవర్ మాట్లాడుతుండగా రోడ్డు మధ్యలో నిలిచి ఉంచిన లారీని వేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి శవ పరీక్షల నిమిత్తం అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మృతుడు తల్లిదండ్రులు, పెళ్లి కుమార్తె తల్లిదండ్రులు రక్తంతో తడిసిన శుభలేఖలను చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఈ మేరకు రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


ప్రమాదానికి గురైన బస్సు

పెదపాడు, ఫిబ్రవరి 11 : కృష్ణా - ఏలూరు జిల్లాల సరిహద్దు ప్రాంతం కలపర్రు టోల్‌గేట్ సమీపంలో శనివారం రాత్రి 12 గంటల సమయంలో విజయవాడ నుంచి విశాఖపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్సు ముందు వున్న లారీని ఢీకొన్న ఘటనలో 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వైద్యసిబ్బంది రెండు 108 అంబులెన్స్‌లలో క్షతగాత్రులను హనుమాన్‌జంక్షన్, ఏలూరు నగరాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు చికిత్స నిమిత్తమై తరలించారు. ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి కేసు నమోదు కాలేదు.

యువకుడి ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 11: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాడేపల్లిగూడెం పట్టణంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలివి.. పట్టణంలోని సిపాయిపేటకు చెందిన ముత్యాల పవన్(27) కారు నడుపుకునేందుకు 2022లో కారు కొనుగోలు చేశాడు. అయితే సరిగా కిరాయిలు లేకపోవడంతో వాయిదాలు చెల్లించలేక, ఇతర ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులతోనే తనువు చాలిస్తున్నట్టు సూసైడ్ నోట్ లభ్యమైనట్టు ఎస్ఐ సుధాకరరెడ్డి తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

ప్లాస్టిక్ గొడౌన్‌లో మంటలు

» రాయలం రోడ్డులో భారీ అగ్నిప్రమాదం..రూ.5 లక్షల ఆస్తి నష్టం


గోడౌన్‌లో మంటలు వ్యాపిస్తున్న దృశ్యం

భీమవరం క్రైం, ఫిబ్రవరి 11 : భీమవరం పట్టణ శివారు రాయలం గ్రామ పరిధిలో భారీ ఎత్తున అగ్నిప్రమాదం సంభవించింది. ఎస్ఎస్‌వీ టవర్స్ అపార్ట్‌మెంట్ పక్కన ఓ ప్లాస్టిక్ గొడౌన్‌కు ఆదివారం సాయంత్రం నిప్పం టుకుంది. ప్లాస్టిక్ గొడౌన్ పూర్తిగా దగ్ధమైంది. భారీస్థాయిలో మంటలు వ్యాపించి పొగ వ్యాపించింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలు అదుపు చేశారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో కూడా మంటలు వ్యాపిస్తూనే ఉన్నాయి. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం సుమారు ఐదు లక్షల రూపాయల వరకు ఉంటుందని భీమవరం అగ్నిమాపక అధికారి సూర్యప్రకాశరావు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రేషన్ డీలర్లకు రూ.10 వేలు వేతనం, కమీషన్ ఇవ్వాలి


రాజులపాటి గంగాధరరావు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో రేషన్ డీలర్లకు రూ.10 వేలు వేతనం, క్వింటా బియ్యానికి రూ.150 వంతున కమీషన్ ఇవ్వాలని ఏలూరు జిల్లా రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజులపాటి గంగాధరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేనివిధంగా రేషన్ డీలర్లు పంపిణీ చేయాల్సిన సరుకులను ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్ ద్వారా పంపిణీ చేయిస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో డీలర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రేషన్‌డీలర్ల వ్యవస్థకు సమాంతరంగా ఎండీయూ వ్యవస్థను ఏర్పాటుచేసి వారి ద్వారా రేషన్ పంపిణీ చేయించటం దుర్మార్గం అన్నారు. డీలర్లకు తెలంగాణలో ఉన్న విధంగా రాష్ట్రంలోని డీలర్లందరికి గౌరవవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.7,500, పట్టణ ప్రాంతాల్లో రూ.10వేలు ఇచ్చి క్వింటా బియ్యంకు రూ.150 కమీషన్ ఇవ్వాలన్నారు. గత టీడీపీ పాలనలో మాదిరిగా డీలర్లకు బీమా సౌకర్యం, హెల్త్ కార్డులు, సంక్షేమ నిధిని ఏర్పాటుచేసి చనిపోయిన డీలర్లకు మట్టిఖర్చుల కింద రూ.15వేలు ఇవ్వాలని, సామాజిక పెన్షన్లను డీలర్ల ద్వారా పంపిణీ చేయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయాల ఉద్యోగులకు 010తో జీతాలివ్వాలి

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 11: గ్రంథాలయాల ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని ఏపీ రాష్ట్ర జిల్లా గ్రంథాలయాల సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు అన్నారు. విజయవాడలో ఏపీఎన్‌జీవో భవన్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనర్ల ఐక్యకార్యాచరణ సమితి విస్తృతస్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యోగులను అధికారులు వేధిస్తున్నా రన్నారు. మెమోలు, షోకజ్‌నోటీసులు ఇస్తున్నారన్నారు. ప్రశ్నించినవారిని డిప్యూటేషన్ పేరుతో సుదూర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఉద్యోగ సంఘ జేఏసీ రాష్ట్ర చైర్మన్ బండి శ్రీనివాసరావును కోరామన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ జుల్ఫికర్ ఆలీ పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మట్టి టిప్పర్లు

పెదవేగి, ఫిబ్రవరి 11 :పెదవేగి మండలం జానంపేట సమీపంలో పోలవరం కుడికాలువ గట్టును యథేచ్ఛగా తవ్వేస్తూ అక్రమంగా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. శనివారం రాత్రి పోలవరం కుడికాలువ గట్టును తవ్వేస్తూ మట్టిని తరిస్తున్నారనే సమాచారంతో ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్కే. ఖాజావలి దాడిచేసి, రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న టిప్పర్లను పెదవేగి తహసీల్దారు కార్యాలయానికి తరలించారు.

టీడీపీ నాయకుల ఇంటిపై వైసీపీ మూక దాడి

» ఇంటిలో వస్తువులు ధ్వంసం..

కొప్పాక గ్రామానికి చెందిన కాటేపల్లి సాంబశివరావు, అతడి అన్న సత్యవర్ధన్ టీడీపీ నాయకులు. అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు గుంపుల రంగారావు, పోతురాజు, బైరెడ్డి వెంకన్న తదితరులు పోలవరం కుడి కాలువ గట్టును అక్రమంగా తవ్వుతూ సొమ్ములు చేసుకుంటున్నారు. ఈక్రమంలో పలుమార్లు అధికారులు అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్న టిప్పర్లను, ఎక్స్‌కవేటర్‌లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ఇది టీడీపీ నాయకులైన సాంబశివరావు, సత్యవర్ధన్‌లు సమాచారం అందించడంతోనే అధికారులు మా వాహనాలను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశారని భావించిన వైసీపీ నాయకులు గుంపుల రంగారావు, పోతురాజు, బైరెడ్డి వెంకన్న ఆధ్వర్యంలో దాదాపు వంద మందికి పైగా వైసీపీ శ్రేణులు.. టీడీపీ నాయకులు అన్నదమ్ముల ఇంటిపై దాడికి వెళ్లారు. తొలుత సత్యవర్ధన్ ఇంటిపై దాడి చేస్తుండగా సాంబశివరావు తన ఇంటికి తాళం వేసి అతడి ఇంటికి వెళ్లారు. సాంబశివ రావు కుటుంబ సభ్యులందరూ సత్యవర్ధన్ ఇంటిదగ్గర ఉండగానే కొంతమంది వైసీపీ శ్రేణులు వెనుకగా వెళ్లి తాళం వేసి ఉన్న సాంబశివరావు ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లో ప్రవేశించి బీరువా, మంచాలు టీవీ ఫ్రిజ్ ఇతర వంట సామగ్రి మొత్తం ధ్వంసం చేశారు. అడ్డుపడ్డ కాటేపల్లి సాంబశివరావు, అతడి కుమారుడు నాగసురేష్, సోదరుడు సత్యవర్ధన్, ఆయన కోడలు ఐశ్వర్యలపై దాడికి తెగబడి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కొప్పాకకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇదంతా కక్షపూరితంగానే చేస్తున్న చర్యగా బాధితులు పేర్కొన్నారు.

నేడు ఎస్పీ స్పందన

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 11: పట్టణ రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల స్పందన నిర్వహించనున్నట్లు రూరల్ ఎస్ఐ గురవయ్య తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు స్పందన ఉంటుందన్నారు. జిల్లాలోని ఫిర్యాదుదారులు ఎస్పీకి తమ వినతుల్ని అందించవచ్చున్నారు.

గ్రామాల్లో సమస్యల్ని పరిష్కరిస్తాం

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 11: గ్రామాల్లో నెలకొన్న సమస్యల్ని దశలవారీగా పరిష్కరిస్తామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆదివారం వేములదీవి గ్రామంలో పర్యటించారు. వార్డుల్లో పర్యటిస్తూ ప్రజల నుంచి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, ఇళ్ళ నిర్మాణం, విద్యుత్, రహదారులు వంటి సమస్యల్ని త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట తిరుమాని నాగరాజు, రమేష్‌నాయుడు, దొంగ మురళీ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు మంచి రోజులు వస్తాయి'

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 11: షర్మిల నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వస్తాయని పీసీసీ సభ్యుడు గాదిరెడ్డి వనమయ్య అన్నారు. వైసీపీ అరాచకాలను ఎండగడుతూ ముందుకెళ్ళడమే దీనికి నిదర్శమన్నారు. రానున్న రోజుల్లో షర్మిల నాయకత్వంతో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో నరసాపురం సీటు కోసం ఐదుగురు దరఖాస్తు చేశారన్నారు. చాలా మంది మాజీ స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు.

గాన గంధర్వుడు ఘంటసాల



ఆకివీడులో ఘంటసాల విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఆకివీడు, ఫిబ్రవరి 11: ఘంటసాల మధురగీతాలు సూర్య, చంద్రులు ఉన్నంత కాలం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని సినీ గాయకులు మోహన్, రమణ అన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా స్థానిక సరిగమ సంగీత్ పరిషత్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు సింగవరపు కోటేశ్వరరావు అధ్యక్షతన దొరగారి చెరువు గట్టు దగ్గరున్న ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. గానంతోనే కాకుండా సంగీతంలో కూడా తెలుగు వారిని పరవశింపజేసిన గానగంధర్వుడు ఘంటసాలన్నారు. కార్యక్రమంలో సరిగమ సంగీత పరిషత్ కార్యదర్శి కొల్లి వెంకన్నబాబు, గాయకుడు, యోగాసనాచార్య కందుల సత్యనారాయణ, కౌన్సిలర్ గేదెల అప్పారావు, వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య, షేక్ వలీ, దాసరి సత్యనారాయణ, అట్లూరి రంగారావు, గుర్రాని శ్రీను, సతీష్ పాల్గొన్నారు.

భీమవరం టౌన్: ఘంటసాల గానమృతం యుగాంతం వరకు చిరస్మరణీయమని ప్రజా నాట్య మండలి సభ్యులు ఎస్ కే చాన్ బాషా అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మారుతీ టాకీస్ సెంటర్‌లోని పద్మశ్రీ ఘంటసాల విగ్రహం వద్ద ఘంటసాల వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రహ్మణ్యం, గంటా సుందర కుమార్, చెరుకూరి రాము, పి శ్రీనివాస్, సాయి బాబా దేవస్థానం సభ్యులు పాల్గొన్నారు.

తణుకు: ఘంటసాల వెంకటేశ్వరరావు తన గానంతో సంగీతాభిమానులను పరవశింపజేశారని వావిలాల సరళాదేవి అన్నారు. ఆదివారం ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ పార్కు వద్ద గల ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 75 చిత్రాలకు సంగీతం దర్శకత్వం వహించి, ఎన్నో పాటలను పాడడమే కాక ఎందరికో సహాయ సహకారాలు అందించారన్నారు. వావిలాల వీర వెంకట పవన్‌కుమార్, కడియాల సూర్యనారాయణ, షణ్ముఖి విజయ్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం వీకర్స్ కాలనీలో ఘంటసాల విగ్రహానికి ఘంటసాల గానసభ అధ్యక్షుడు ఎస్. ఖాసిం ఆధ్వర్యంలో పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ సాంస్కృతిక నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు, మహిళా శిల్పి దేవికారాణి ఉడయార్, గానసభ కార్యదర్శి డి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ నష్ట పరిహారం ఇవ్వాలి

భీమవరం రూరల్, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో గత ఖరీఫ్ పంటకు సంబంధించిన తుఫాన్ పంట నష్టం పరిహారం తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కౌలు రైతుల సంఘం రాష్ట్ర శిక్షణ తరగతులు భీమవరంలోని క్లాత్ మర్చెంట్ భవనంలో ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగాయి. వ్యవసాయ సంక్షోభం, కౌలు రైతుల సమస్యలపై క్లాసును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ బోధించారు. కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత సార్వా పంటకు దెబ్బతిన్న పంట నష్టం ఇంతవరకు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. తక్షణం కౌలు రైతులకు పంట నష్టం, పంట బీమా అందించాలని డిమాండ్ చేశారు.

డీకేపల్లిలో జనసేన తాగునీరు సరఫరా

గణపవరం, ఫిబ్రవరి 11: డీకే.వల్లి ప్రజలకు కాలంగా స్వచ్ఛమైన తాగునీరు లభించక ఇబ్బందులకు గురవుతు న్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి సరఫరా చేస్తున్న తాగునీరు పూర్తి స్థాయిలో ఫిల్టర్ కాకపో వడం వల్ల అవస్థలు పడాల్సి వస్తుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఈవోపీఆర్‌డీ పి.సత్యనారాయణను వివరణ కోరగా 50శాతం ఫిల్టర్‌బెడ్స్‌లో ఇసుక నింపారని మిగిలిన శాతం ఇసుక నింపాల్సి ఉందన్నారు. తాగునీరు నమూనా పరీక్షలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈక్రమంలో గత 15 రోజుల నుంచి ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పచ్చమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా గ్రామస్థులకు ఉచితంగా తాగునీటిని పంపిణీ చేసి గ్రామస్థుల దాహార్తిని తీర్చుతున్నారు.

రైతులకు డీసీసీబీ వినూత్న సేవలు

ఉండి, ఫిబ్రవరి 11 : డీసీసీబీ ఆధ్వర్యంలో వినూత్నమైన మార్పులకు శ్రీకారం చుట్టినట్లు రైతులకు ప్రజలకు వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. ఆదివారం యండగండిలో జనరిక్ మందుల షాపును, ఏటీఎంలను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. నరసింహరాజు మాట్లాడుతూ పేదలకు తక్కువ ఖర్చులకు మందులను అందించేందుకు జనరిక్ మందులను తమ బ్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా సహకార బ్యాంక్ పరిధిలో ఐదు చోట్ల జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేయనున్నట్లు ఇప్పటికే మూడుచోట్ల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరో రెండుచోట్ల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

బాబుతోనే రాష్ట్రం అభివృద్ధి: వలవల



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 11: వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా, అభివృద్ధి పరంగా వెనుకబడిపోయిందని చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి అన్నారు. పెదతాడేపల్లిలో రెండో రోజు ఆదివారం బాబుషూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం కొనసాగించారు. పార్టీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, సర్పంచ్ పోతుల అన్నవరం, పరిమి సురేష్, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, కరుటూరి గోవిందరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





తణుకులో ఆరిమిల్లి సమక్షంలో పార్టీలో చేరిన యువకులు.. ముత్యాలపల్లిలో పొత్తూరి ర్యాలీ... కృష్ణాపురంలో బొలిశెట్టి సమక్షంలో జనసేనలో చేరిక

'రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీని గెలిపిద్దాం'

కాళ్ళ, ఫిబ్రవరి 11 : భావితరాల భవిష్యత్ కోసం టీడీపీని గెలిపించుకోవల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. కోపల్లె గ్రామంలో 2వ రోజు టీడీపీ భవిష్యత్‌కు గ్యారెంటీ, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో పెంచిన పన్నులు కట్టలేక పేద, మధ్యతరగతి ప్రజలు అల్లాడుతున్నారన్నారు. మిని మేనిఫెస్టో అంశాలను మహిళలకు వివరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ బూడి నాగమణి, ఉపసర్పంచ్ బూడి వెంకటపరాలు, దంతులూరి శ్రీనివాసరాజు, తోట ఫణిబాబు, బూడి సత్యనారాయణ, బాలం బాపూజీ పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

తణుకు, ఫిబ్రవరి 11: టీడీపీ, జనసేన ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం తణుకు మండలం కొమరవరం వైసీపీ ఉప సర్పంచ్ గొళ్ళ ప్రసాదుతో పాటు పలువురు యువకులు టీడీపీలో చేరగా ఆరిమిల్లి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. చంద్రబాబు, పవన్‌తోనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పితాని మోహనరావు, టీడీపీ నాయకులు మాదిరెడ్డి శ్రీరామచంద్రమూర్తి, పాలా నాగేశ్వరరావు, ముత్యాల వాసు, తోట బుల్లిరాజు తదితరులు పాల్గొన్నారు.

శంఖారావం యాత్ర విజయవంతం కావాలి

మొగల్తూరు, ఫిబ్రవరి 11: నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం యాత్ర విజయవంతం కావాలని కోరుతూ ముత్యాలపల్లిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అమ్మవారికి పూజలు నిర్వహించి గ్రామంలో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు మాట్లాడుతూ 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈయాత్ర సాగుతుందన్నారు. గ్రామంలోని కొర్లపాటి వెంకమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి శంఖారావం విజయవంతం కావాలని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ప్రజల కోసమే జనసేన

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 11: జనసేన పార్టీ ప్రజల దని, వారి కోసమే తాము పనిచేస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీని వాస్ అన్నారు. కృష్ణాపురంలో ఆదివారం పల్లెపోరు నిర్వహించి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజలను నిలువు దోపిడీ చేస్తోందని, రానున్న ఎన్నిక ల్లో ఆ పార్టీని సాగనంపి రాష్ట్ర భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. ముందు గా పెంటపాడు మండలం కొరుమిల్లికి చెందిన పలువురు వైసీపీ నాయకులు బొలిశెట్టి సమక్షంలో జనసేనలో చేరారు. జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

బాబాకు అన్నాభిషేకం



భీమవరం టౌన్, ఫిబ్రవరి 11 : భీమవరంలో మినీ షిరిడి ఆలయ 31వ వార్షికోత్సవం ముగింపు సందర్భంగా బాబా వారికి అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు ముందుగా స్వామివారికి 22 రకాల ద్రవ్యాలతో నమక, చమకపారాయణతో రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి వేద మంత్రాలతో అన్నాభిషేకాన్ని చందన రంగారావు పద్మావతి దంపతులు నిర్వహించారు. స్వామివారికి చేసిన అన్నాన్ని భక్తులకు ప్రసాదంగా అన్న సమారాధన నిర్వహించారు.

డ్రోన్‌లతో ఎరువుల పిచికారీ



ఆచంట, ఫిబ్రవరి 11: వ్యవసాయ పనులకు రైతులు టెక్నాలజీ వినియోగిస్తున్నారు. తాజాగా ఎరువులు పిచికారి చేసేందుకు రైతులు డ్రోన్‌లను వినియోగిస్తున్నారు. ఎకరం పొలం కూలీలు ద్వారా ఎరువులు పిచికారి చేయాలంటే సుమారు గంటన్నర సమయం పడుతుందని, అదే డ్రోన్‌లు ద్వారా కేవలం 5 నిముషాల్లోనే ఎకరం పొలం మొత్తం పిచికారి అవుతుందని రైతులు చెబుతున్నారు. అయితే దీనికి ఖర్చు కాస్త ఎక్కువైనా సమయం కలిసి వస్తుందని రైతులు చెబుతున్నారు. రెండు రోజులుగా ఆచంట పరిసర ప్రాంతాల్లో డ్రోన్‌లు ద్వారా పిచి కారి చేస్తుండగా ఆసక్తిగా తిలకిస్తున్నారు.

మీడియా ప్రతినిధులకు భద్రత కల్పించాలి



ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గంలో ఎన్నికైన పాత్రికేయులను సన్మానించిన దృశ్యం

భీమవరం టౌన్, ఫిబ్రవరి 11 : రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో మీడియా ప్రతినిధుల భద్రతకు పోలీసులు, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇండియన్ జర్నలిస్ట్‌యూనియన్ జాతీయ కార్యదర్శి డి.సోమ సుందర్ విజ్ఞప్తి చేశారు. భీమవరంలో ఆదివారం భీమవరం ఏరియా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. యూనిట్ అధ్యక్షుడు కేవీ ప్ర సాద్ అధ్యక్షత వహించారు. గత నెలలో నిర్వహించిన జిల్లా ఏపీయూడబ్ల్యూజే మహా సభలో జిల్లా కమిటీకి ఎన్నికైన భీమవరం యూనిట్ సభ్యులకు, జిల్లా ముఖ్య నాయకులకు అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సోమసుందర్ మాట్లాడుతూ త్వరలో భీమవరంలో జర్నలిస్టులకు మూడు రోజులు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా అధ్యక్షుడు వీఎస్ సాయిబాబ, జనరల్ సెక్రటరీ గజపతి వరప్రసాద్, సీనియర్ జర్నలిస్టు గంటాగోపి, భాస్కర్ రావు తదితరులు మాట్లాడుతూ యూనియన్ ఐక్యత గురించి ప్రస్తావించారు. తొలుత ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర డైరీని ఆవిష్కరించారు.

వీరవాసరంలో జనంలోకి జనసేన

వీరవాసరం, ఫిబ్రవరి 11: వీరవాసరంలో టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి మేనిఫెస్టోలతో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. మేనిఫెస్టో కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఎస్టీ కాలనీ, పెదపేట, బొంతువారి పేట, ప్రాంతాలలో ఇంటింటికీ తిరిగారు. కార్యక్రమంలో జనసేన , టీడీపీ మండలశాఖ అధ్యక్ష కార్యదర్శులు జవ్వాది బాలాజీ, కొల్లేపర శ్రీనివాస్, మద్దాల శ్రీరామకృష్ణ, యరకరాజు గోపాలకృష్ణంరాజు, మోపిదేవి విశ్వేశ్వరరావు, చింతా కనకయ్య, కవురు శివకృష్ణ పాల్గొన్నారు.

మాదిగ సామాజిక వర్గానికి అన్యాయం

యలమంచిలి, ఫిబ్రవరి 11: నామినేటెడ్ పదవుల కేటాయింపులో మాదిగ సామాజిక వర్గానికి స్థానం కల్పించకుండా వైసీపీ నాయకులు అన్యాయం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ రత్నరాజు మాదిగ ఆరోపించారు. ఇలపకుర్రు గ్రామంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కాటూరి సువర్ణరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో రత్నరాజు మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పాలకొల్లు మార్కెట్ యార్డ్ కమిటీని నియమించారని, ఈ కమిటీలో ఎస్సీలకు 4 డైరెక్టర్లు ఇచ్చి కేవలం మాలలకు మాత్రమే స్థానం కల్పించారని అన్నారు. అలాగే పాలకొల్లు మండల ఎస్సీ సెల్ అధ్యక్ష పదవుల్లో మాదిగ సామాజిక వర్గానికి చోటు కల్పించకపోవడం దారుణమన్నారు.

సంచార శకటంతో వైద్య సేవలు

తణుకు, ఫిబ్రవరి 11: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా నిర్వహించే ఇంటింటా వైద్య సేవలు ఆదివారం సంధ్యాజ్యోతి వృద్ధాశ్రమంలో నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలి మహేంద్ర వైద్య పరీక్షలు చేశారు.

విద్యార్థుల సరస్వతీ పూజ

భీమవరం టౌన్, ఫిబ్రవరి 11 : గునుపూడిలో సోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానంలో హిందూధర్మ ప్రచార మహోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులు సరస్వతీ పూజల నిర్వహించారు. అనంతరం గునుపూడకి చెందిన హరే శ్రీనివాస భజన మండలిచే కోలాట ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఎదుట వేద పండితులు వేద పారాయణ చేశారు.

మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన

భీమవరం టౌన్, ఫిబ్రవరి 11: మాదకద్రవ్యాల వాడకం, దాని దుష్పరిణామాల గణాంకాలు చూస్తుంటే ఆందోళనగా ఉందని కెనెరా బ్యాంక్ ఆఫీసర్ విశాలాక్షి అన్నారు. జమాతే ఇస్లామి హింద్ సంస్థ నిర్వహిస్తున్న రండి! మత్తు రహిత సమాజాన్ని స్థాపిద్దాం అనే రాష్ట్ర వ్యాప్త అవగాహన ఉద్యమంలో భాగంగా భీమవరం పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ముస్లిమ్స్ కమ్యూనిటీ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఫర్హాన్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. పట్టణ ఉద్యమ కన్వీనర్ ముహ్మద్ సిద్దీఖ్ మాట్లాడుతూ సమాజంలో మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత జీవితం నాశనం అవుతుందని అన్నారు. మాజీ అధ్యక్షుడు శ్రీ యేలేటి న్యూటన్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కరీముల్లా పాల్గొన్నారు.

'అనూహ్యం' సందేశాత్మక నాటికగా నిలవాలి

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 11: పాలకొల్లు నటీనట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రముఖ నాటక రచయిత తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచించిన 'అనూహ్యం' నాటిక పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి అనుగ్రహంతో ఉత్తమ సందేశాత్మక నాటికగా నిలవాలని కోరుకుంటున్నట్లు దేవస్థానం చెర్మన్ కోరాడ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నాటిక ప్రతులను శ్రీక్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజ చేయించి అనంతరం నాటిక ప్రతులను నటీనట సంక్షేమ సమాఖ్య సభ్యులకు అందచేశారు. ఉస్మానియా యూనివర్శిటీ థియేటర్ ఆఫ్ ఆర్ట్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ జీఎస్. ప్రసాదరెడ్డి, రచయిత తాళాబత్తులు వెంకటేశ్వరరావు, నాటిక నిర్వాహకుడు గుడాల హరిబాబు, గంటా ముత్యాల నాయుడు, పుత్సల నాగలింగేశ్వరరావు, మాదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమవరం హాస్పిటల్స్‌లో పూర్తిస్థాయి గుండె వైద్య సేవలు



విలేకరులతో మాట్లాడుతున్న ఆస్పత్రి నిర్వాహకులు

భీమవరం క్రైం, ఫిబ్రవరి 11 : భీమవరం హాస్పిటల్స్‌లో విజయవాడ ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సహకారంతో పూర్తిస్థాయి గుండె వైద్య సేవలు ప్రారంభించారు. రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ గుండె జబ్బులకు వైద్యం అత్యవసరంగా అందవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని భీమవరం హాస్పిటల్స్‌లో పూర్తిస్థాయి గుండె వైద్య సేవలు లభ్యమయ్యేటట్లు ఏర్పాట్లు చేశామన్నారు. ఇద్దరు కార్డియాలజిస్టులు, ముగ్గురు క్లినికల్ కార్డియాలజిస్టుల వైద్య బృందంతో యాంజియోగ్రామ్, స్టెంట్ యాంజియోప్లాస్టీ, పేస్ మేకర్, హార్ట్ ఎటాక్, అన్ని గుండె సమస్యలకు అత్యవసర వైద్యం అందించే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. భీమవరం హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ 24 గంటలూ నిపుణులైన గుండె వైద్య బృందంతో అధునాతన వైద్య పరికరాలతో సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ మూర్తి, ఎమ్మెల్యే రామరాజు, భీమవరం హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా.గోపాలరాజు, రమేష్ హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ డా.పావులూరి శ్రీనివాసరావు, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డా.రాయపాటి మమత, బిజినెస్‌హెడ్ డా.కార్తీక్ చౌదరి పాల్గొన్నారు.

కమ్మ కులస్థుల ఆత్మీయ సమావేశం

పాలకొల్లు రూలర్, ఫిబ్రవరి 11: పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల కమ్మ కులస్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం పాలకొల్లు కమ్మ సంఘం ఆధ్వర్యంలో దూబచర్ల వెంకటేశ్వరరావు కోకోనట్ దుకాణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలకొల్లు కమ్మ సంఘం కార్యదర్శి తమ్మినీడి సత్యనారాయణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మ సంఘం ప్రతినిధులు మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తెలుగుదేశం పార్టీకి పూర్తిస్థాయి మద్దతును ప్రకటించి ఆర్థికంగా కూడా ఆదుకోవాలని సంఘం ఏకగ్రీవంగా తీర్మానించింది. కార్యక్రమంలో పాలకొల్లు కమ్మ సంఘం అధ్యక్షుడు నెలకుర్తి చెంచయ్య, మాజీ కౌన్సిలర్ మేడికొండ శ్రీనివాస చౌదరి, నెలకుర్తి సత్యనారాయణ, మండాది వెంకటేశ్వరరావు, తాలూరి బుజ్జిబాబు, బొప్పన హరికిషోర్, ఆరిమిల్లి చిన్ని పాల్గొన్నారు.

మందాలమ్మకు బంగారు నేత్రాల బహూకరణ



పెనుగొండ, ఫిబ్రవరి 11: వడలి గామ దేవత మందాలమ్మ ఆలయానికి సంకురాత్రి సుబ్బారావు, రాఘవ దేవి దంపతుల కుమారులు వెంకట ఆదిత్య శ్రీనివాస్, దుర్గా ప్రతాప్ కుటుంబ సభ్యులు 12 గ్రాములు బంగారు నేత్రాలు (రూ.74 వేల విలువ) బహూకరించారు.

అమ్మవారికి తోటకూర ఆకులతో అలంకారం



భీమవరం టౌన్,ఫిబ్రవరి 11 : శ్యామలాదేవి నవరాత్రులు పురస్కరించుకుని మెంటేవారితోట లోని బాలా త్రిపుర సుందరీ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ఆదివారంనాడు అభిషేకాలను ఆలయ అర్చకుడు కొమ్మశ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మాజీ కౌన్సిలర్ నందమూరి ఆంజనేయులు దంపతుల సౌజన్యంతో తోటకూరతో అలంకారం చేశారు.

సూర్యనారాయణమూర్తికి అభిషేకాలు



పెనుమంట్ర, ఫిబ్రవరి 11: మాఘమాసం మొదటి ఆదివారం పురస్కరించుకుని జుత్తిగలోని శ్రీ ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి ఆలయంలో ఉన్న శ్రీ సూర్య నారాయణ మూర్తికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక క్షీరాభిషేకాలు నిర్వహించి అలంకారం చేశారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ



సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రామరాజు

ఉండి, ఫిబ్రవరి 11: ఎస్ఆర్‌పీ అగ్రహారంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే రామరాజు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే రామరాజును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయంలో పీటలపై మునుకోలు సింహాచలం దంపతులు, మునుకోలు హరీష్ దంపతులు, మునుకోలు శివప్రసాద్ దంపతులు, బురిడి వీర్రాజు దంపతులు, బురిడి సింహాచలం దంపతులు, శివ దంపతులు, మునుకోలు చలపతిరావు దంపతులు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాత ఊరేగింపు



తాడేపల్లిగూడెంలో పూజల్లో పాల్గొన్న మహిళలు

మొగల్తూరు,ఫిబ్రవరి 11: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. అమ్మవారిని పల్లకిలో గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గణపతిపూజ, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

తాడేపల్లిగూడెం రూరల్: వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లిగూడెం వాసవీ కన్యకాపరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం 27 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహావిష్కరణ జరిగింది. వాసవీ క్లబ్ అధ్యక్షులు నున్నా ఆనంద్, కార్యదర్శి సీహెచ్‌వీఆర్ గుప్తా, కోశాధికారి కె. రంగ తదితరులు పాల్గొన్నారు.

పేరుపాలెంలో చొల్లంగి స్నానాలు



పేరుపాలెం తీరంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మొగల్తూరు,ఫిబ్రవరి 11: పేరుపాలెంలో దుర్గమ్మ అమ్మవారికి ఆదివారం చొల్లంగి స్నానాలు నిర్వహించారు. ప్రతీ ఏటా మాఘ మాసంలో అమావాస్య వెళ్ళిన తరువాత వచ్చే ఆది లేదా గురువారం అమ్మవారిని మేళతాళాలు, బాణసంచా కాలుస్తూ మోళ్ళపర్రు కనక దుర్గమ్మ బీచ్ వరకూ ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీ. తీరగ్రామాల్లోని భక్తులు వేలాదిగా పాల్గొని ఈ అమ్మవారి స్నానాలకు ప్రత్యేకంగా తరలివస్తారు. దుర్గమ్మ అమ్మవారికి సముద్రస్నానం అనంతరం తీరంలో అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమ పూజలు నిర్వహించి మట్టి ఉండలు నివేదిస్తారు. అమ్మవారి సముద్రస్నానం అనంతరం వచ్చే రెండు అమావాశ్యల తరువాత జాతర మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ.

టీడీపీలో చేరిక

పెనుమంట్ర,ఫిబ్రవరి 11 : మండలం నెగ్గిపూడి గ్రామానికి చెందిన ఎస్సీ బీసీ యువజన సంఘం నాయకులు 50 మంది మాజీ మంత్రి పితాని సత్యనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని మోసం చేసిన జగన్ రెడ్డిపై వ్యతిరేకతతో తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చిర్ల బాలాజీ రెడ్డి వెలగల మల్లికార్జున్ రెడ్డి, గుబ్బల నాగేశ్వరరావు, కడలి సత్యనారాయణ, కట్ట బాలాజీ వను కుమార్ పాల్గొన్నారు.

ఆలోచనా రహిత స్థితిని చేరటమే ధ్యానం

వీరవాసరం, ఫిబ్రవరి 11: ధ్యానం చేయటం ద్వారా ఆలోచన రహిత స్థితిని చేరటం వలన విశ్వమయ ప్రాణశక్తిని పొందవచ్చునని ధ్యానరత్న డాక్టర్ యు.సాంబశివరావు అన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే ధ్యానాభ్యాసం అలవాటు చేయాలని తెలియచేస్తూ పిరమిడ్ ధ్యానులతో సామూహిక ధ్యానం చేయించారు. ఆదివారం వీరవాసరంలోని సీతారామస్వామి దేవస్థానం ఆవరణలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ నిర్వహించిన ఉచిత ధ్యానశిక్షణ కార్యక్రమంలో డాక్టర్ సాంబశివరావు జ్ఞాన, ధ్యాన సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఈనెల 24 న పేరుపాలెం బీచ్‌లో నిర్వహించే పౌర్ణమి ధ్యానం కరపత్రాన్ని, పోస్టర్‌ను ఆవిష్కరించారు.

విశ్వకర్మ పథకాన్ని ఉపయోగించుకోవాలి

తణుకు, ఫిబ్రవరి 11: ప్రధాని మోదీ విశ్వకర్మ యోజనను 18 రకాల వృత్తుల వారు వినియోగించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ అన్నారు. ఆదివారం ఆకుల శ్రీరాములు కళాశాలలో జరుగుతున్న కుట్టు శిక్షణ తరగతులను సందర్శించి, సదుపాయాలపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అవినాష్ కాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 11: కేంద్ర పథకాలపై ఆదివారం బీజేపీ నాయకులు వార్డు, గ్రామాల్లో పల్లే బాట పట్టారు. పార్టీ ఆధ్వర్యంలో పల్లెకుపోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలందించారు. పట్టణ అధ్యక్షుడు మునికోటి వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రజలకు ప్రధాని మోదీ అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. దీనిపై పార్టీ శ్రేణులంతా అవగాహన కల్పించి ప్రజల్ని చైతన్యపర్చాలన్నారు.

పాలకోడేరు: బీజేపీ మండల కన్వీనర్ ఇంజేటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గొరగనమూడి, కొండేపూడి, విస్సాకోడేరు, కుముదవల్లి గ్రామాల్లో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరేంద్రమోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కోకన్వీనర్ చెన్నంశెట్టి నాగరాజు, ప్రసాదం ఏడుకొండలు, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు భగవాన్‌రాజు, జిల్లా కోశాధికారి పాకర్ల హరిప్రసాద్ పాల్గొన్నారు.

యలమంచిలి: గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా ప్రధాని మోదీ పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారని ఏఎంసీ మాజీ చైర్మన్ ఉన్నమట్ల కబర్ధి అన్నారు. బీజేపి మండలశాఖ ఆధ్వర్యంలో కొంతేరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమంలో ఉన్నమట్ల కబర్ధి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్త దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా దీన్ దయాళ్ చిత్రపటానికి కబర్ధి, బీజేపి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.



నరసాపురంలో కరపత్రాలు చూపుతున్న బీజేపీ నాయకులు

పెనుమంట్ర: పల్లెకు పోదాం కార్యక్రమాన్ని బీజేపీ ఆధ్వర్యంలో నెగిపూడి గ్రామంలో నిర్వహించారు. ఆచంట అసెంబ్లీ కన్వీనర్ కేహెచ్‌వీ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి పథకాలను వివరించారు.

కాళ్ళ: కోలనపల్లి, కాళ్ళ, పెదఅమిరం గ్రామాల్లో బీజేపీ శ్రేణులు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ఉండి ఇన్‌చార్జి కోరా రామ్మూర్తి, మండలాధ్యక్షుడు సుంకర కాశీవిశేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. సర్పంచ్ కొనకంచి సూర్యనారాయణమూర్తి, పానకాల కృష్ణాంజనేయరావు పాల్గొన్నారు.